క్లుప్తంగా

వైభవంగా సూర్య హోమం


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి అమ్మవారు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం పంచాయతన పూర్వక నవ చండీ యోగ రాజశ్యామల మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, సూర్య, మహా సౌర హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 5వ తేదీ వరకూ జరిగే ఈ మహోత్సవాల్లో అమ్మవారికి రోజుకో అలంకరణ చేస్తున్నారు. బ్రహ్మశ్రీ భళ్లమూడి దివాకర శాస్త్రి పర్యవేక్షణలో 11 మంది స్మార్త పండితులు ఈ పూజాధికాలు, హోమాలు నిర్వహిస్తున్నారని ఆలయ ప్రధాన అర్చకులు కాళ్లకూరి సత్య సుబ్రహ్మణ్యం తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 6వ తేదీన మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ రాంబాబు తెలిపారు.

సౌరయాగంలో వేదస్వస్తి


వేదస్వస్తి నిర్వహిస్తున్న పండితులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో 23వ రోజు ఆదివారం వేదస్వస్తి ఘనంగా నిర్వహించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గరిమెళ్ల విశ్వనాథం, క్రొ భాస్కరవధాని, కృష్ణ చైతన్య, శివ, సుబ్బయ్యలు ఘనంగా వేదస్వస్తి నిర్వహించి సౌర విశిష్టతను వివరించారు. ఋత్విక బృందం అనురాధ నక్షత్ర జాతకులచే పొగడ చెట్టుకు పూజలు చేయించారు. ఆదిత్య పఠనం, శ్రీచక్రార్చన, త్రిచపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం


గొల్లవిల్లిలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు రవికుమార్

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో అమలాపురం రవి ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యులు చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు రవికుమార్, లక్ష్మీశిల్ప 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వినికిడి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, సూదా లక్ష్మీనారాయణ, కాశిన కుమారస్వామి, అరిగెల నానాజీ, జొన్నాడ చిన్ని, పోలిశెట్టి వీరబాబు, సలాది పట్టాభి, కాకిలేటి కృష్ణతాతయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



డాక్టర్ ఆకెళ్ల కామేశ్వరిని సత్కరిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సత్యవరప్రసాద్

అమలాపురం రూరల్: మహిళలు గర్భం ధరించిన నాటి నుంచి పౌష్టికాహారం తినడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులైన బిడ్డలు పుడతారని డాక్టర్ ఆకెళ్ల కామేశ్వరి అన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం ఎస్‌కేబీఆర్ కాలేజీలో స్త్రీల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు కామేశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వలవల వెంకటరెడ్డి, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, జోన్ చైర్మన్ యర్రమిల్లి సత్యనారాయణ, సప్పా నాగేశ్వరరావు, డాక్టర్ విష్ణుమూర్తి, ప్రొఫెసర్ గోకర కొండ నాగేంద్ర, కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ స్థానం బీజేపీకి కేటాయింపు

యానాం: పుదుచ్చేరి ఏకైక పార్లమెంటరీ నియోజకవర్గ స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్లు సీఎం రంగసామి ప్రకటించారు. పోలియోచుక్కల కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం నముదురాజ్యం కాంగ్రెస్(ఎన్ఆర్ కాంగ్రెస్), బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఇరు పార్టీల పరస్పర అవగాహన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే అభ్యర్థి ఎవరనేది పార్టీ అధిష్టానం ప్రకటిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత సిటింగ్ ఎంపీ వైతిలింగం పేరును ఆ పార్టీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

పదికి సర్వం సిద్ధం


తాళ్లరేవులో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు


స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థినులు

- ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఐ.పోలవరం: పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి నెలాఖరు లోపు పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీంట్లో భాగంగా మార్చి 18వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షల షెడ్యూలు విడుదల చేసింది. పరీక్షా కేంద్రాలను గుర్తించడంతో పాటు మౌలిక సదుపాయల కల్పనకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. మరోవైపు పరీక్షల సమయం దగ్గర పడడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం నానా హైరానా పడుతున్నారు. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో ఉన్న 112 పాఠశాలల్లో 6,383 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించడంతో విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నమూనా పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా రోజూ ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. పదో తరగతికి సంబంధించి గతంలో ప్రతి సబ్జెక్టుకు రెండు పేపర్ల చొప్పున పరీక్ష నిర్వహించేవారు. కాని ఈ ఏడాది సైన్స్‌లో మినహా మిగిలిన సబ్జెక్టుల్లో ఒకే పేపర్ చొప్పున పరీక్ష జరపనున్నారు. సైన్స్ మాత్రమే ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌గా వేర్వేరుగా నిర్వహించనున్నారు.

పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
ఐ.పోలవరం	15	699
ముమ్మిడివరం	15	789
కాట్రేనికోన	11	543
తాళ్లరేవు	12	1029
అమలాపురం	38	2083
అల్లవరం	13	654
ఉప్పలగుప్తం	8	586
మొత్తం	112	6383

స్టడీ అవర్స్ వల్ల చాలా ఉపయోగం



ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా ఉపాధ్యాయులు బోధిస్తుండడంతో పాఠాల్ని బాగా నేర్చుకోగలుగుతున్నాం. ప్రధానంగా బైజూస్ కంటెంట్ వల్ల కష్టమైన చాప్టర్ కూడా సులభంగా అర్థమవుతుంది. అంతేకాక ఉదయం, సాయంత్రం ఏర్పాటుచేస్తున్న స్టడీ అవర్స్ మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– గుత్తుల సాహితి, పదో తరగతి విద్యార్థిని, ఐ.పోలవరం

నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ



మండలంలోని పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇచ్చాం. ప్రభుత్వం అందజేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం స్టడీఅవర్స్ ఏర్పాటుచేసి వారి డౌట్స్ క్లియర్ చేస్తున్నాం.

– ఎస్.కొండారెడ్డి, ఎంఈఓ, ఐ.పోలవరం

వైభవంగా సత్తెమ్మ జాతర


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


జాతరలో అలరించిన శక్తి వేషాలు

ముమ్మిడివరం: కోనసీమ ప్రజల ఆరాధ్య దేవత సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర, తీర్థం ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. కోనసీమ నుంచే కాకుండా ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రముఖులు మేకల వంశీయులు అమ్మవారికి స్వయం పాకాలు సమర్పించి జాతర ప్రారంభించారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుంచి డప్పుడమరుకాలు, సన్నాయిమేళాలు, బాజాభజంత్రీలు, శక్తి వేషధారణలు, నాగిని డ్యాన్స్‌లు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయిబాబా సేవా సంఘం, సమరత ఫౌండేషన్‌కు చెందిన వలంటీర్లు సేవా కార్యక్రమాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ డి.సురేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు.

ముస్లింలు సంఘటితం కావాలి


జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్, వైస్ చైర్మన్ హుస్సేన్‌లను సత్కరిస్తున్న ముస్లిం నాయకులు

అమలాపురం టౌన్: ముస్లింలంతా సంఘటితమై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని పలు మసీదులకు నిధులు మంజూరైన సందర్భంగా స్థానిక శ్రీరామపురంలో ఆదివారం ఉదయం జరిగిన అభినందన సభలో ఖాదర్ మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అందరం శ్రమించాలని సూచించారు. జిల్లాలోని ముస్లింలంతా పార్టీకి అండదండగా ఉంటున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం నాయకులు జిల్లా చైర్మన్ ఖాదర్, వైస్ చైర్మన్ హుస్సేన్‌లను ఘనంగా సత్కరించారు. అభినందన సభలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు ఎండీవై షరీఫ్, రబ్బాని, కర్రార్ హుస్సేన్, అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అన్వర్ రాజా, జిల్లా పార్టీ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ అన్వర్, ఖ్వాజాబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా గణేష్



గణేష్‌కు నియామక పత్రం అందిస్తున్న వెంకట రామిరెడ్డి

అమలాపురం రూరల్: పట్టణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా గాంధీనగర్ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పాలమూరి గణేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో యూనియన్ కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. జనరల్ సెక్రటరీగా కొప్పర్తి మురళీకృష్ణ, కోశాధికారిగా రాపాక ఆశ కిరణ్, వర్కింగ్ అధ్యక్షులుగా చొప్పల శామ్యూల్, సీహెచ్ నందికేశ్వరరావు, సీహెచ్ శంకర్, ఉపాధ్యక్షులుగా కె.ఈశ్వర్, ఎస్ఎల్‌బీ కుమారి, జాయింట్ సెక్రటరీలుగా కముజు దుర్గతి నాథ్, నాగలక్ష్మి, ఈసీ మెంబర్లుగా బి.అశోక్, వంకాయల సతీష్‌లను ఎన్నుకున్నారు. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్ జగడం, ప్రధాన కార్యదర్శి మట్టపర్తి సముద్రం తదితరులు అభినందించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


చొల్లంగిపేట గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ డీఎఫ్‌ఓ అనూష

తాళ్లరేవు: మానవ మనుగడకు వన్యప్రాణులు ఎంతగానో దోహదపడతాయని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఉప అటవీ శాఖాధికారి టి.అనూష అన్నారు. ఆదివారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా చొల్లంగిపేట గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనూష మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వివిధ కారణాలతో అంతరించిపోతున్న జంతువులు, వృక్ష జాతులపై అవగాహన పెంచడానికి వాటిని రక్షించడానికి ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిందన్నారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు గౌతమ్ వరప్రసాద్, ఎం.నాగార్జున, బీట్ ఆఫీసర్‌లు మహేష్, గోపి, నాగేంద్ర, సంధ్యారాణి, బయోలజిస్ట్ డి.మహేష్‌బాబు ప్రిన్సిపాల్ పి.పద్మావతి, ఉపాధ్యాయులు రమణి, పార్వతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక

అమలాపురం రూరల్: కొత్తపేటలో జరిగిన ఈఎండీపీ(వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం) జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు తయారుచేసిన కోనసీమ టూర్స్ యాప్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైందని పాలగుమ్మి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంట్రు వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 6 వ తేదీన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ ప్రాజెక్టు తయారుచేసిన 9వ తరగతి విద్యార్థులు కె.జయేంద్ర, సీహెచ్ లోకేష్, పాఠశాల గైడ్ టీచర్ చంద్రావతిలను హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని బొలిశెట్టివారిపాలెంలో వీరభద్రస్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద వేగి శ్రీను, ఉలిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి సంబరాన్ని బొలిశెట్టివారిపాలెంలో ఘనంగా జరిపించారు. విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజలు ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్


అమలాపురంలో పోలియో చుక్కలు వేస్తున్న పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బులినాని


పటవలలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత


ఉప్పలగుప్తంలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

అల్లవరం: పిల్లల నిండు జీవితం కోసం తల్లిదండ్రులు రెండు పోలియో చుక్కలు వేయించడం అవసరమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన ఆధ్వర్యంలో ఆదివారం పల్స్‌పోలియో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, డాక్టర్ సుమ, సూపర్‌వైజర్ సుధాకర్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: పోలియో నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. అమలాపురం పట్టణంలోని భూపయ్య అగ్రహారంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటరులో ఆదివారం ఉదయం వారిద్దరూ పిల్లలకు పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పోలియో చుక్కల శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తన మూడేళ్ల కుమారుడిని శిబిరానికి తీసుకురాగా స్వయంగా చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి పోలియో చుక్కలు వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక గురిగుంట చెరువు వద్ద గల పట్టణ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.విజయ పల్స్ పోలియో నిర్వహించారు. 13వ వార్డు సచివాలయంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. కౌన్సిలర్లు దొంగ నాగ సుధారాణి, నాగారపు వెంకటేశ్వరరావు, బండారు గోవిందు, వాసర్ల లక్ష్మి, యండమూరి గంగ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కల్వకొలను ఉమ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలో 96 శాతం పల్స్‌పోలియో నమోదైనట్లు పీహెచ్‌సీ వైద్యులు ఈశ్వర్ తెలిపారు. మండల పరిధిలోని 46 సెంటర్లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. పటవల పంచాయతీలో ఎంపీపీ రాయుడు సునీత చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి నిండు జీవితంలో వెలుగులు నింపినవారవుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రాయుడు గంగాధర్, హెల్త్ విజిటర్ నెహ్రూరాణి, హెల్త్ అసిస్టెంట్‌లు ఆంజనేయులు, గోవిందు, ఏఎన్ఎంలు ఇందిర, స్రవంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పల్స్‌పోలియో శిబిరాలను ఆదివారం ఆయన పరిశీలించారు. విలసవిల్లి వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, మునిపల్లి పంచాయితీ పరిధిలో సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని 10 సచివాలయాల్లో 20 బూత్‌లలో వైద్యాధికారి డా.శివగాయత్రి ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఐదేళ్ల లోపు వయసున్న పిల్లలకు పోలియో చుక్కలు వేసి 98 శాతం లక్ష్యం సాధించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సత్యనారాయణ పోలియో బూత్‌లను పరిశీలించారు.

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక పీహెచ్‌సీ పరిధిలోని 17 బూత్‌లలో వైద్యాధికారులు డా.సీహెచ్ ముకుంద, డా.శ్రీపూజల ఆధ్వర్యంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఐదేళ్ల లోపు వయసున్న పిల్లలు 2412 మందికి పోలియో చుక్కలు వేయడం లక్ష్యం కాగా 2378 మందికి వేసి 98.32 శాతం లక్ష్యం సాధించారు. మిగిలిన పిల్లలకు 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామన్నారు. డీఎంఅండ్ హెచ్‌ఓ దుర్గారావు దొర పోలియో బూత్‌లను పరిశీలించారు.

కాట్రేనికోన: మండల పరిధిలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర తనిఖీ చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చెయ్యేరు గున్నేపల్లి సత్తెమ్మ తల్లి జాతర, చిర్రయానం సముద్ర తీరం వెంబడి ఉన్న వలస మత్స్యకారులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పల్స్ పోలియో కేంద్రాలను ఆయన పరిశీలించారు. కాట్రేనికోన పీహెచ్‌సీ, వేట్లపాలెం, సత్తెమ్మ చెట్టు, గచ్చకాయలపోర తదితర పల్స్‌పోలియో కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి లిఖిత తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి గొల్లపల్లిని కలిసిన ఎమ్మెల్సీ కుడుపూడి


మాజీ మంత్రి గొల్లపల్లిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును తాటిపాకలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆదివారం కలిశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కోనసీమలో పార్టీ గెలుపు అంశాలపై చర్చించారు. అనంతరం గొల్లపల్లి సూర్యారావును ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అమలాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్‌లు సత్కరించారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ


బాధిత కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని మొల్లిపాలెంలో అగ్ని ప్రమాదం జరిగి ఆశ్రయం కోల్పోయిన వలంటీర్ చుట్టుగుళ్ల రాజేంద్రప్రసాద్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నిత్యావసరాలు, 25 కేజీల బియ్యాన్ని అందించారు. ఎమ్మెల్సీ వెంట సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీను, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, వాసర్ల శ్రీమన్నారాయణ, చేట్ల ఏడుకొండలు, కొడమంచిలి దివ్యతాతాజీ, మల్లవరపు శ్రీను, నవుండ్రు నాగరాజు తదితరులున్నారు.

చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌కు సత్కారం


చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌ను ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి నిధులు సమకూర్చిన ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు, ఆ నిధులను సద్వినియోగం చేసి కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేసిన చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, కాశి వెంకటాచార్య, జనిపెల్ల బాలకృష్ణ, కాశి జగజ్జీవన్‌రామ్, వి.బాబాయి, పి.డానియోలు, పాము ఆనందరావు, ఎం.లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయతీ పరిధి గోకనవిల్లిలో రూ.5 లక్షల జీజీఎంపీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే గోకనవిల్లి, విలసవిల్లి గ్రామాలను కలిపేలా అమలాపురం మేజర్ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణాన్ని చేపట్టి గ్రామస్తులకు ఇబ్బందుల నుంచి విముక్తి కలిగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, వార్డు సభ్యురాలు జంగా నాగమణి, ముషిణి లింగేశ్వరరావు, రాంబాబు, ధనలక్ష్మి, శీలం దుర్గారావు, చేట్ల సోమేశ్వరి, పలివెల లోవరాజు పాల్గొన్నారు.

బాలయోగికి ఘన నివాళి


బాలయోగికి నివాళులర్పిస్తున్న ఆయన కుమారుడు హరీష్ బాలయోగి

అమలాపురం రూరల్/ముమ్మిడివరం/ఐ.పోలవరం: లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి 22వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి జీఎం హరీష్ బాలయోగి ఆదివారం అమలాపురంలోని బాలయోగి ఘాట్ వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత మెగా విద్య శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముమ్మిడివరంలోని పోలమ్మ చెరువు గట్టు వద్ద గల బాలయోగి విగ్రహానికి, పాతఇంజరంలోని యానాం–ఎదుర్లంక వారధి వద్ద గల బాలయోగి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానందలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదునూరి రామలింగరాజు ఆర్థిక సాయంతో సమకూర్చిన వీల్ చైర్లను విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.